దిక్సూచి
DIKSUCHI



అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

ఒకప్పుడు రాజు-పేద తదుపరి భూస్వామి-పేద రైతు, మరి కొంత కాలానికి యజమాని-కార్మికుడు ఇలా ఆర్థిక అంతరాలు అనాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రజలంతా త్రాసుకు ఒకవైపు ఉంటారు. రెండో వైపు ఉండే కొద్దిమంది నిరంతరం సంపన్నులవుతూనే ఉంటున్నారు. గతంలో నెమ్మదిగా పెరిగిన ఆర్థిక అంతరాలు ఇప్పుడు రోజూ కొన్ని రెట్ల వేగంతో దూసుకుపోతున్నాయి. పేదలు మరింత పేదరికంలోకి జారిపోతుండగా వారివద్ద నుంచి కార్పొరేట్‌లు దోచుకొంటున్న సంపద వారిని మరింత సంపన్నులుగా చేస్తోంది. ఈ అంతరాల ధోరణులను అలాగే దేశాల మధ్య, దేశాలవారీ, వర్గాలవారీ ఏర్పడుతున్న ఆర్థిక అంతరాలను విపులీకరిస్తూ దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు తొలి రోజున ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్ సంస్థ 'ఇనీక్వాలిటీ ఇంక్: హౌ కార్పొరేట్ పవర్ డివైడ్స్ అవర్ వరల్డ్ అండ్ ద నీడ్ ఫర్ ఏ న్యూ ఎరా ఆఫ్ పబ్లిక్ యాక్షన్' పేరిట ఒక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక అంతరాలు, దానికి గల కారణాలు, పరిష్కార మార్గాలు చర్చించారు. అంతేకాక భారతదేశ పరిస్థితులకు అద్దంపడుతూ 'సర్వైవల్ ఆఫ్ ద రిచెస్ట్:ద ఇండియా స్టోరీ' పేరుతో ప్రత్యేక నివేదికను సైతం ఆక్స్‌ఫామ్ ఇండియా సంస్థ విడుదల చేసింది.

ఆక్స్‌ఫామ్ ప్రపంచ ఆర్థిక అంతరాల నివేదిక

ప్రపంచం-ఆర్థిక అంతరాల ధోరణులు

- 2020 నుంచి అంటే గడచిన మూడేళ్లలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన తొలి అయిదుగురి సంపద రెండింతలైంది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా 500 కోట్లమంది అంటే ప్రపంచ జనాభాలో 60 శాతం మంది మరింత పేదరికంలోకి కూరుకుపోయారు.
- ప్రస్తుత ధరల్లో చూస్తే ప్రపంచంలోని పేదరికం అంతం కావడానికి 230 ఏళ్లు పట్టగా మరో పదేళ్లలో తొలి ట్రిలియనీర్ ఆవిర్భవించనున్నారు.
- గ్లోబల్ కార్పొరేట్‌లు ఏకస్వామ్య శక్తులుగా అవతరించి భారీ స్థాయిలో సంపదను పోగుచేయడం అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అధిక అసమానతలకు కారణమైంది.
- ప్రపంచంలో పది అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఏడింటి సీఈఓలు/ప్రధాన షేర్‌హోల్డర్లు బిలియనీర్లుగా ఉన్నారు.
- ప్రపంచంలోని 96 ప్రధాన కంపెనీలు ఆర్జిస్తున్న ప్రతి వంద డాలర్ల లాభంలో 82 డాలర్లు యాజమాన్యానికే(సంపన్న షేర్ హోల్డర్స్‌కే) దక్కుతోంది.
- ప్రపంచంలోని బిలియనీర్లు 2020తో పోలిస్తే 3.3 ట్రిలియన్ డాలర్ల అదనపు సంపద పోగేసుకున్నారు. ఈ మూడేళ్లలో 34 శాతం మంది మరింత సంపన్నులుగా ఆవిర్భవించారు. ప్రపంచ తొలి అయిదుగురు సంపన్నులైన ఎలాన్‌మస్క్, బెర్నార్డ్ ఆర్నాల్ట్, జెఫ్‌బెజోస్, లారీ ఎలిసన్, మార్క్‌జుకర్‌బర్గ్‌ల సంపద గడచిన మూడేళ్లలో 464 బిలియన్ డాలర్లు పెరిగింది. ఇదే సమయంలో కరోనా, ఆర్థిక మాంద్య పరిస్థితుల పేరిట వీరి సంస్థలైన అమెజాన్, ఫేస్‌బుక్ వంటివాటిలో భారీగా ఉద్యోగులను తొలగించారు. గడచిన మూడేళ్లలో కరోనా, యుద్ధాలు, జీవన వ్యయాల సంక్షోభం, పర్యావరణ విఘాతం వంటి ఒడుదొడుకులకు సామాన్యులను గురిచేస్తూ 'డికేడ్ ఆఫ్ డివిజన్(అంతరాల దశాబ్దం)'కు నాంది పడింది. ఈ కాలంలో సంభవించిన ప్రతి సంక్షోభం జనాభాలో అధికంగా ఉన్న పేద వర్గాలను మరింత పేదరికంలోకి నెట్టి కొద్ది మంది చేతుల్లో ఉన్న సంపదను మరింత పెంచింది.
- ఈ ఆర్థిక అంతరాలు ప్రపంచ జనాభాలోనే కాదు ప్రపంచ దేశాల మధ్య కూడా విస్తరించాయి. గ్లోబల్ నార్త్ అంటే సంపన్న దేశాలుగా పిలిచే ఉత్తరార్థ గోళ పాశ్చాత్య దేశాల్లో సంపద మొత్తం కేంద్రీకృతమయింది. ప్రపంచ జనాభాలో కేవలం 21 శాతం మంది నివశించే ఈ ప్రాంతంలో 69 శాతం వ్యక్తిగత సంపద, 74 శాతం ప్రపంచ బిలియనీర్ల సంపద వచ్చి చేరింది. గడచిన 25 ఏళ్లలో తొలిసారి గ్లోబల్ నార్త్-గ్లోబల్ సౌత్ మధ్య అంతరాలు భారీగా పెరిగాయి.
- తక్కువ ఆదాయ, దిగువ మధ్య ఆదాయ దేశాలు ఎదుర్కొంటున్న ఇంధన, ఔషధ, ఆహార దిగుమతుల వ్యయాల కోసం చేస్తున్న రుణాలకు రాబోయే 2029 నాటికి రోజూ 50 కోట్ల డాలర్ల మేర వడ్డీ చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇది ఆయా దేశాల బలహీన వర్గాలు, మహిళా సంక్షేమంపై మరింత ప్రతికూల ప్రభావం చూపనుందని అంచనా!
- ప్రపంచవ్యాప్తంగా మహిళల కంటే పురుషులు 105 ట్రిలియన్ డాలర్ల ఎక్కువ సంపదతో ఉన్నారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు నాలుగింతలు ఎక్కువ. ఆరోగ్య, సామాజిక రంగాల్లో పనిచేసే ఒక మహిళ మొత్తం సంపాదన, ఒక ఫార్చ్యూన్ 100 కంపెనీలోని సీఈఓ వార్షిక వేతనంతో సరితూగాలంటే 1200 ఏళ్లు పడుతుంది. వివిధ వర్గాల పరంగా తీసుకుంటే అమెరికాలో నివసించే సాధారణ నల్ల జాతి కుటుంబం సంపద, సాధారణ శ్వేత జాతి కుటుంబ సంపదలో 15.8 శాతం మాత్రమే ఉంటుంది. బ్రెజిల్‌లో నల్లజాతి ప్రజలతో పోలిస్తే శ్వేతజాతీయుల సంపాదన 70 శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్త ఆస్తుల్లో 43 శాతం వరకు కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ఉంది. అదేవిధంగా మధ్య ప్రాచ్యంలో ఒకశాతం మంది సంపన్నులకు 48 శాతం ఆర్థిక సంపద ఉండగా ఆసియాలో ఒకశాతం మంది సంపన్నులకు 50 శాతం సంపద, యూరప్‌లో ఒక శాతం మంది సంపన్నులకు 47 శాతం సంపద ఉంది.

ఏకస్వామ్యాల యుగం-కార్పొరేట్ శక్తుల విజృంభణ

- సంపద కేంద్రీకరణ-కార్పొరేట్ సామ్రాజ్యాలు-ఏకస్వామ్య ధోరణులు పరస్పర పూరకాలుగా పనిచేస్తూ ఒక వలయంగా ఏర్పడి ఆర్థిక అంతరాలు మరింత పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక విధానాలతో చిన్న సంస్థలను అణచివేస్తూ ఏకస్వామ్యాలను స్థాపిస్తున్నాయి. ప్రభుత్వ పాలసీలు సైతం సరళీకరించడంతో అన్ని రంగాల్లో ఏకీకృత ధోరణులు పెరిగి లాభాల ఆర్జనే పరమావధిగా మారింది. ఆ లాభాల్లో ఉద్యోగులకు, పన్నుల రూపంలో ప్రభుత్వాలకు అతి తక్కువ వాటా చేరుతోంది. అత్యధిక భాగం కార్పొరేట్ యాజమాన్యాలకు దక్కుతూ ఏకీకృత ధోరణులు బలపడడానికి దోహదమవుతోంది. పోటీ పెద్దగా లేకపోవడం, ప్రభుత్వపర నియంత్రణ లేకపోవడం వల్ల ధరల నియంత్రణ, మార్కెట్ నియంత్రణ లేక ఉత్పత్తి వ్యయం కన్నా అనేక రెట్లు ఎక్కువ ధర నిర్ణయమవుతోంది. సంపద మొత్తం కొందరి చేతుల్లోకే తరలిపోతుంది. ఉదాహరణకు 1995-2015 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 60 ఫార్మాస్యూటికల్ కంపెనీలు విలీనమై పది అతిపెద్ద ఫార్మా ఫర్మ్‌గా అవతరించాయి. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 40 శాతం పైనే రెండు కంపెనీలకు ఉంది. నాలుగింట మూడొంతుల ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయం అంతా మెటా, అమెజాన్, ఆల్ఫాబెట్‌లకే చేరుతోంది. 90 శాతం ఆన్‌లైన్ సెర్చ్ గూగుల్ ద్వారానే సాగుతోంది. ఈ విధంగా భారీ టెక్ కంపెనీలు టెక్నాలజీ రంగంలో ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి.
- వ్యవసాయ రంగంలో అధిక భాగం బహుళజాతి ఆహార ప్రాసెసింగ్ కంపెనీల చేతుల్లో; భారత పారిశ్రామిక రంగం అంతా అయిదు అతి పెద్ద సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైంది. ఈ ధోరణి వల్ల శక్తి, ఆహారం, ఔషధ రంగాల్లో తీవ్రంగా ధరల దోపిడీ కొనసాగుతోంది. ఇతర చిన్నపాటి సంస్థలు ఎదిగి పోటీ ఇచ్చేందుకు అవకాశం లేకుండా ఆర్థిక నిధులు, రుణ వసతులను సైతం బడా కంపెనీలే చేజిక్కించుకుంటున్నాయి.

అసమానతలకు కారణమయ్యే కార్పొరేట్ ధోరణులు

శ్రామికులకు దక్కని ప్రతిఫలం

- బడా కార్పొరేటర్లు శ్రామికులకు/ఉద్యోగులకు కనీసం జీవన వ్యయాలను సైతం చెల్లించకుండా శ్రమదోపిడీ చేస్తూ లాభాలను అల్ట్రారిచ్ వ్యాపార భాగస్వాముల మధ్య పంచుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1600 అతిపెద్ద కంపెనీల్లో కేవలం 0.4 శాతం మాత్రమే తమ ఉద్యోగులకు కనీసం జీవన వ్యయానికి అవసరమైన వేతనాలు అందిస్తున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 80 కోట్లమంది శ్రామికులు ద్రవ్యోల్బణాన్ని అధిగమించే స్థాయి వేతనాన్ని పొందలేకపోతున్నారు. ఈ వేతన వ్యత్యాసం అనేది లింగ, జాతిపరంగా ఎక్కువగా ఉంది. 2019లో పురుష కార్మికులతో పోలిస్తే వారి ప్రతి డాలర్ ఆదాయానికి మహిళ కార్మికులు కేవలం 51 సెంట్లు మాత్రమే పొందారు. వ్యవసాయ రంగం, సప్లయ్ చెయిన్లలో ఈ వివక్ష మరీ ఎక్కువగా ఉంది. ప్రమాదకర పని పరిస్థితుల కారణంగా ఏటా 2.3 మిలియన్‌ల మంది కార్మికులు పని సంబంధిత వ్యాధులు, ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారు.
- లేబర్ యూనియన్‌లను కార్పొరేట్ సంస్థలు ఉక్కుపాదంతో అణచి వేయడం; కార్మిక చట్టాలు, బాల కార్మిక చట్టాలను సరళం చేస్తూ ప్రభుత్వాలు సవరణలు తీసుకురావడం వల్ల కూడా ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.

మిగతా రేపటి పేజీలో..



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బడ్జెట్ తయారీ ఇలా

ఇండియన్ ఎకానమీ

ప్రభుత్వం ప్రకటించే వార్షిక ఆర్థిక ప్రకటనను బడ్జెట్ అంటారు. కేంద్రప్రభుత్వం భారత రాజ్యాంగంలోని 112వ ఆర్టికల్ ప్రకారం తన వార్షిక, ఆర్థిక ప్రకటన(బడ్జెట్)ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి.

బడ్జెట్‌లో ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ వసూళ్లు, రుణాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. రాబోయే సంవత్సరానికి ప్రకటించే బడ్జెట్‌లో ఆ ఏడాదికి సంబంధించిన అంచనాలు, గత సంవత్సరానికి సవరించిన మొత్తాలు, అంతకు ముందు ఏడాదికి చెందిన అంతిమ సమాచారం ఉంటుంది. ఉదాహరణకు 2023-24 సంవత్సరం ముగుస్తున్నప్పుడు 2024-25 సంవత్సరం కోసం బడ్జెట్ ప్రకటిస్తే 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంచనాలు ఉంటాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాలు ఉంటాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన చివరి అంచనాలు ఉంటాయి.

బడ్జెట్ రకాలు

1) సంతులిత బడ్జెట్ 2) లోటు బడ్జెట్ 3) మిగులు బడ్జెట్

1) సంతులిత బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయం సమానంగా ఉన్నప్పుడు సంతులిత బడ్జెట్ అంటారు.

2) లోటు బడ్జెట్: ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయాన్ని మించినప్పుడు లోటు బడ్జెట్ అంటారు.

లోటు బడ్జెట్ భావనలు: ఎ) బడ్జెట్ లోటు(ద్రవ్యలోటు) బి) రెవెన్యూ లోటు సి) విత్తలోటు డి) ప్రాథమిక లోటు ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు

ఎ) బడ్జెట్ లోటు: మొత్తం ప్రభుత్వ వసూళ్ల కంటే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉండటం. దీనినే ద్రవ్యలోటు అంటారు. ఎందుకంటే కేంద్రబ్యాంకు ముద్రించి ఇచ్చే ద్రవ్యంతో ఈ లోటును ప్రభుత్వం పూరించుకుంటుంది.

బి) రెవెన్యూ లోటు: మొత్తం రెవెన్యూ వసూళ్ల మొత్తం రెవెన్యూ వ్యయం కంటే తక్కువగా ఉండటం.

సి) విత్తలోలోటు: ప్రభుత్వ మొత్తం, ప్రభుత్వ రుణేతర వసూళ్లను మించిపోవడాన్ని విత్తలోటు అంటారు. బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలను, ఇతర అప్పులను(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు)ను కలిపితే కూడా విత్తలోటు తెలుస్తుంది. ప్రభుత్వ వ్యయం నుంచి రెవెన్యూ వసూళ్లు, రుణాల వసూళ్లు, ఇతర వసూళ్ల(పెట్టుబడుల ఉపసంహరణ నిధులు) తీసివేస్తే వచ్చేది విత్తలోటు.

డి) ప్రాథమిక లోటు: విత్తలోటు నుంచి వడ్డీ చెల్లింపులను తీసివేయగా వచ్చేది ప్రాథమిక లోటు.

ఇ) ప్రభావిత రెవెన్యూ లోటు: రెవెన్యూ లోటు నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మూలధన ఆస్తుల నిర్మాణం కోసం ఇచ్చిన నిధుల(గ్రాంట్స్)ను తీసివేస్తే వచ్చేది ప్రభావిత రెవెన్యూ లోటు.

మిగులు బడ్జెట్

ప్రభుత్వ వ్యయం కంటే ప్రభుత్వ ఆదాయం ఎక్కువగా ఉండటాన్ని మిగులు బడ్జెట్ అంటారు. మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దాదాపు జరగదు. సాధారణంగా లోటు బడ్జెట్‌నే ప్రభుత్వాలు ప్రవేశపెడుతుంటాయి.

బడ్జెట్ రూపకల్పన

బడ్జెట్‌లో రెండు స్థూల అంశాలుంటాయి.

1) ప్రభుత్వ వ్యయం 2) ప్రభుత్వ వసూళ్లు

1. ప్రభుత్వ వ్యయం: ప్రభుత్వ వ్యయాన్ని తిరిగి రెండు రకాలుగా వర్గీకరిస్తారు.

ఎ) రెవెన్యూ వ్యయం బి) మూలధన వ్యయం

ఎ) రెవెన్యూ వ్యయం: రెవెన్యూ వ్యయంలో వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, రక్షణ వ్యయం, పాలన వ్యయం, రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర గ్రాంటులు ఉంటాయి.

బి) మూలధన వ్యయం: అభివృద్ధి సంబంధిత వ్యయం, రక్షణకు సంబంధించిన మూలధన వ్యయం, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఇచ్చే రుణాలను మూలధన వ్యయంగా పరిగణిస్తారు.

2. ప్రభుత్వ వసూళ్లు: ప్రభుత్వ వసూళ్లను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. 1. రెవెన్యూ వసూళ్లు 2. మూలధన వసూళ్లు

1. రెవెన్యూ వసూళ్లు: ఇవి రెండు రకాలు

ఎ) పన్నుయేతర వసూళ్ల బి) పన్నుల వసూళ్లు

ఎ) పన్నుయేతర వసూళ్లు: ప్రభుత్వం ఇచ్చిన రుణాలపై వసూలు చేసుకొనే వడ్డీ, ప్రభుత్వరంగ సంస్థలు ఆర్జించిన లాభాల నుంచి ప్రభుత్వానికి వచ్చే డివిడెండ్లను పన్నుయేతర రెవెన్యూ వసూళ్లుగా పరిగణిస్తారు.

బి) పన్ను వసూళ్లు: పన్నులు స్థూలంగా రెండు రకాలు

1) ప్రత్యక్ష పన్నులు 2) పరోక్ష పన్నులు

ప్రత్యక్ష పన్నులు: ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైనే ఉంటే వాటిని ప్రత్యక్ష పన్నులు అంటారు. ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను, వృత్తిపన్ను, సంపదపై పన్ను, వ్యయ పన్ను, బహుమతిపై పన్ను, భూమిశిస్తు మొదలైనవి ప్రత్యక్ష పన్నులు. ఈ పన్నులను ఎవరిపై విధిస్తారో వారే చెల్లించాలి. పన్నుభారాన్ని బదిలీ చేయడం వీలుకాదు. ఎవరిపైన పన్ను విధించారో దానిని ఆరంభ భారం అంటారు. ఎవరు పన్ను చెల్లించారో దానిని అంతిమభారం అంటారు. అంటే ఆరంభ భారం, అంతిమ భారం ఒకరిపైననే పడినట్లు లెక్క.

పరోక్ష పన్నులు: ఆరంభ భారం ఒకరిపై అంతిమ భారం మరొకరిపై పడితే అలాంటి పన్నులను పరోక్ష పన్నులు అంటారు. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ), వ్యాట్, కస్టమ్స్ సుంకాలు, ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను, సేవల పన్ను మొదలైనవి పరోక్ష పన్నులు. ఈ పన్నుల భారాన్ని బదిలీ చేయడానికి అవకాశం ఉంటుంది. అంటే ఆరంభ భారం ఒకరిపై అంతిమభారం మరొకరిపై పడే అవకాశం ఉంది. ఉదాహరణకు జీఎస్‌టీని ఉత్పత్తి విలువపై లేదా అమ్మకపు విలువపై లేదా సేవా విలువపై విధిస్తారు. అంటే ఉత్పత్తిదారునిపై లేదా అమ్మకందారునిపై లేదా సేవలు ఇచ్చిన వ్యక్తిపై పన్ను ఆరంభ భారం పడింది. కానీ ఆ పన్ను భారాన్ని ఉత్పత్తిదారుడు హోల్‌సేల్ వ్యాపారికి, హోల్‌సేల్ వ్యాపారి రిటైల్ వ్యాపారికి, రిటైల్ వ్యాపారి వినియోగదారునికి బదిలీ చేస్తారు. అంటే పన్ను అంతిమభారం వినియోగదారునిపై పడిందన్నమాట. వీటినే పరోక్షపన్నులు అంటారు.

మూలధన వసూళ్లు

రుణాల వసూళ్లు, మార్కెట్ రుణాలు, ఇతర అప్పులు(ప్రావిడెంట్ ఫండ్, చిన్న పొదుపు మొత్తాలు), ఇతర వసూళ్ల(పెట్టుబడి ఉపసంహరణ నిధులు) మూలధన వసూళ్లలో ఉంటాయి.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.



కానూరి ఆనందకుమారి ట్రస్ట్ ద్వారా చెక్కుల పంపిణీ దృశ్యం

పేదల కోసమే కానూరి ఆనందకుమారి ట్రస్ట్

- 100 మందికి కృత్రిమ అవయవాలు..
- 30 మంది రైతులకు రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందజేత

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలను ఆదుకుని వారికి తోడుగా నిలిచేందుకే కానూరి ఆనందకుమారి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరామచంద్రరావు యలమంచిలి అన్నారు. విద్యార్థులు, రైతులకు నిరంతరాయంగా సేవలందిస్తామని పేర్కొన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమీర్‌పేట్ ధరంకరణ్ రోడ్డులోని మునిసిపల్ గ్రౌండ్‌లో ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన 30 మంది నిరుపేద రైతులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున చెక్కులు అందజేశారు. శ్రీభగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయత సమితి సహకారంతో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది దివ్యాంగులకు ట్రస్టు తరఫున కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. శ్రీరామచంద్రరావు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో భాగస్వాములమయ్యేందుకే ట్రస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రస్టీ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. తాను లండన్‌లో వైద్యురాలిగా, హైదరాబాద్‌లో చెల్లి రాగిణి ఐటీ సెక్టార్‌లో పనిచేస్తున్నామని.. తాము సంపాదించిన దానిలో 90% పేదలకు సాయం చేసేందుకు వెచ్చిస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీలో ఆత్మహత్యలు చేసుకున్న 89 మంది రైతుల కుటుంబాలకు, నిరుపేద అన్నదాతలకు 2016లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం చేసి, అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 174 మంది పిల్లలను చదివిస్తున్నామని, భవిష్యత్‌లోనూ ట్రస్టు తరఫున మరింత మందికి సాయం చేస్తామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

తమ సమితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని 60 వేల మంది వికలాంగులకు జైపూర్ కృత్రిమ అవయవాలను అందజేశామని శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి ప్రెసిడెంట్ శర్మ అన్నారు. 2004లో కింగ్ కోఠి ఆస్పత్రిలో సంస్థను ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ 10-12 మందికి ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కానూరి ఆనంద కుమారి ట్రస్టు తరఫున ఆదివారం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశామన్నారు.

పోటీకి రంగం సిద్ధం

- లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా అనీల్‌కుమార్ ఖరారు
- నరసరావుపేటలో కార్యాలయ భవనాల పరిశీలన

నరసరావుపేట, జనవరి 28: నరస రావుపేట పార్లమెంట్‌కు వైసీపీ నుంచి పోటీకి మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌యాదవ్ సిద్ధమయ్యారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం అనీల్ కుమార్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహ నరెడ్డి స్వయంగా ఆయనతో చర్చించి నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో నరసరావుపేటలో కార్యాల యం, నివాస భవనాల కోసం ఆయన ముఖ్య అనుచరులు పరిశీలించారు. పల్నాడు రోడ్డులోని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి స్థలంలోని పార్టీ జిల్లా కార్యాలయాన్ని అనీల్‌కుమార్ కార్యాలయానికి ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుడికి సంబంధించిన ఓ భవనాన్ని ఆయన నివాసం కోసం పరిశీలించినట్లు నేతలు చెబుతున్నారు. బీసీ కార్డు ప్రయోగించేందుకే అనీల్‌ను పోటీలో దింపుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఆయ న నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. కొందరూ ఎమ్మెల్యేలతో కూడా తన పోటీపై చర్చించినట్లు సమాచారం. ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటే తప్ప అనీల్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగడం ఖాయమని వైసీపీ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఈ నేపథ్యంలో తనను నరసరావుపేట నుంచి పోటీకి ఆదేశించారని అనీల్ కుమార్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

మాట తప్పిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

- ఎస్టీయూ ఏపీ. జిల్లా వార్షిక సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు

ఫిరంగిపురం, జనవరి 28 : సీపీఎస్ పై ఆట తప్పిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సహచర ఉద్యోగ ఉపాధ్యాయులతో కలసి కృషి చేస్తామని వక్తలు అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలో ఎస్టీయూ ఏపీ విద్యా సదస్సు, జిల్లా 77వ వార్షిక సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా విధానం 20-20 పేరుతో అశాస్త్రీయంగా 3, 4, 5 తరగతులను వేరు చేసి హైస్కూళ్ళల్లో విలీనం చేయటం వల్ల నాలుగు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని వారు విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబరు 117 వల్ల ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ పేరుతో సర్దుబాటు చేసినందున తొమ్మిది వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిన దుస్థితి ఉందన్నారు. సీఎం జగన్ 2019లో ఇచ్చిన ఎన్నికల హామీ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. జీపీఎస్ పేరుతో కొత్త నాటకానికి తెరతీస్తే రాబోయే సాధారణ ఎన్నికల్లో గద్దె దింపటం ఖాయమన్నారు. వైసీపీని గద్దెదించటానికి కలసి వచ్చే సంఘాలతో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్రయ్య, సుభానీ, కే కోటేశ్వరరావు, వాసిమళ్ళ ప్రసాదు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శలు బీ పెదబాబు, పీకే సుబ్బారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూఏపీ నూతన జిల్లా అధ్యక్షుడిగా దార్ల పెదబాబు

ఫిరంగిపురంలో ఆదివారం సెయింట్ పాల్స్ హైస్కూల్లో జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం 77వ వార్షిక సమావేశంలో జిల్లా కౌన్సిల్ పరిశీలకుడికిగా బడుగు శ్రీనివాస్, ఎన్నికల అధికారిగా ఎస్ఎం సుభానీలు ఎంపికను నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఏవీ ప్రసాదుబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా వై శ్యామ్‌బాబు, పీవీ సుబ్బారావు, సీహెచ్ ప్రకాశరావు, మద్దిరాల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులుగా పీ త్యాగరాజు, గరిక ఏడుకొండలు, సీహెచ్ వెంకటరెడ్డి, కే భరత్‌వ్యాస్, టీ శారద, గడ్డం వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ బ్రహ్మయ్య, కే సద్గుణరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, పీ మరియదాసు, కే అనీల్ కుమార్‌లు ఎంపిక కాగా స్టేట్ కౌన్సిలర్లుగా సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, కే శ్రీనివాస్, ఎస్ రామచంద్రయ్య, జీ అంబరీషుడు, కే బెనహర్ బాబు, కే జోజప్ప, వీ ప్రసాదరావు, కమటం శ్రీనివాసరావు, బీఏ జోసెఫ్, కే విజయబాబు, ఎస్ రాజశేఖర్, కేవీ సుబ్బారావు, షేక్ బాజీ, ఎంవీజే కెనడీలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సమావేశాన్ని ఫిరంగిపురం మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రసాదు, అధ్యక్షులు టీ భాస్కర్, పీ ప్రసాదు, ఆర్ రాజశేఖర్, సుందరరావు, గుండెగ జోజప్ప, మేడా శ్రీను, సాంబశివరావు, పీ జోజిలు నిర్వహించారు.

వైభవంగా రథోత్సవం

- హాజరైన వేలాది మంది భక్తులు
- పూజల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన చినజీయర్‌స్వామి



శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం, హాజరైన భక్తులు

పిడుగురాళ్ల, జనవరి 28: పిడుగురాళ్ల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక ప్రజాశక్తి నగర్‌లో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా గత నాలుగు రోజులుగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. చివరి రోజు ఆదివారం సీతారాముల కల్యాణం శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనంతరం చినజీయర్‌స్వామి మాట్లాడుతూ ప్రతి మనిషి తప్పు చేయడానికి భయపడాలని, చేస్తే అది వెన్నంటి వుంటుందనే భయముంటేనే తప్పు చేయకుండా వుంటే స్వర్గప్రాప్తి కలుగుతుందన్నారు. దేశమంతా శ్రీరామ జపం చేస్తుందని, అలా చేస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాముల వారి ప్రియభక్తుడైన ఆంజనేయస్వామికి పిడుగురాళ్లలో అతిపెద్ద పండుగ, రథోత్సవం జరుపడం సంతోషమన్నారు. సీతారాముల కల్యాణ విశిష్టతను వివరించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో పాటు ఎంఎల్‌సీ జంగా కృష్ణమూర్తి తనయుడు పిడుగురాళ్ల జడ్పీటీసీ వెంకట కోటయ్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా స్వామివారిని దర్శించుకొని రథోత్సవాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రారంభమైన రథోత్సవం పట్టణ ప్రధాన రహదారిలో కొనసాగింది. వేలాది మంది భక్తులు, మహిళలతో దేవాలయ ప్రాంగణంతో పాటు రహదారి మొత్తం కిక్కిరిసింది. రథోత్సవానికి, ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపునకు దారి పొడవున భక్తులు, మహిళలు కోలాట ప్రదర్శనలు చేస్తూ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేలాది మందికి దేవాలయం వద్ద మహాఅన్నదాన కార్యక్రమం జరిగింది. చలు వాది ఫౌండేషన్ తరుపున ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి పంపిణీ కేంద్రాన్ని గురజాల డీఎస్పీ పళ్లంరాజు ప్రారంభించి భక్తులకు అందజేశారు. ప్రముఖ వ్యాపారి కనిగిరి శ్రీనివాసరావు భక్తులకు అవసరమైన మంచినీటి బాటిల్స్, ప్యాకెట్లను వేలాదిగా అందించారు. అదేవిధంగా పట్టణ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. రథోత్సవం స్వామివారి దేవాలయం నుండి ప్రారంభమై ప్రధాన రహదారి గుండా ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకు కొనసాగి తిరిగి దేవాలయం వరకు నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గురజాల డీఎస్పీ పళ్లంరాజు, పట్టణ సీఐ వీరాంజ నేయులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు కాకుమాను మల్లికార్జునరావు, ఆముదాల చినగంగాధరరావు, భవిరిశెట్టి శ్రీను, కాకుమాను గోపాల్‌రావుతోపాటు కోట హరినారాయణ, కొత్త రఘురామయ్య, కట్టమూరి శంకర రావు, పసుమర్తి సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, గుండా నారాయణ, కొమ్మినేని రామచంద్రరావు, నాగాచారి, తదితరులు సహాయసహకారాలు అందజేశారు.



సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఉపన్యసిస్తున్న చినజీయర్‌స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న జేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

ప్రభుత్వ జూనియర్ అధ్యాపకులతో
ప్రిన్సిపాల్స్ పోస్టులు భర్తీచేయాలి

గుంటూరు(విద్య),జనవరి 28: రాష్ట్రంలో ఖాళీగావున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రిన్సిపాల్ పోస్టులను ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ, సర్వీస్ రూల్స్ ప్రకారం జూనియర్ అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించి భర్తీచేయాలని జూనియర్ లెక్చర్ల సంఘం (జేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏసీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ డీఈవో పోస్టులను ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ, సర్వీసు రూల్స్ అనుసరించి ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 75 శాతం అధ్యా పక పోస్టులను ఎప్పటి మాదిరిగానే నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన జూనియర్ అధ్యాపకుల ద్వారా భర్తీచేయాలని కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు డీఐఈవో పోస్టులను, రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు, జిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు బీ.రవికుమార్, ఉపాధ్యక్షుడు బీ.లక్ష్మణరావులు తదితరులు పాల్గొన్నారు.



సంకల్పయాత్రలో పాల్గొన్న వల్లూరు జయప్రకాష్ నారాయణ

ప్రజలను మోసం చేస్తున్న సీఎం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ

గుంటూరు(తూర్పు), జనవరి28: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు వాగ్దానాలతో మభ్యపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్‌నారాయణ మండిపడ్డారు. విజయసంకల్పయాత్ర ఆరవ రోజైన ఆదివారం శ్రీరామ్‌నగర్, యతిరాజునగర్, కొండా వెంకటప్పయ్యకాలనీ, వికలాంగులకాలనీ, వేణుగోపాలపురం మీదగా రామనామ క్షేత్రం, భరతమాత విగ్రహం వరకు సాగింది. యాత్రకు బీజేపీ సీనియర్‌నేత, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రలు సంఘీభావం తెలిపి యాత్రలో పాల్గొ న్నారు.ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ బీజేపీ విజయ సంకల్పయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుం దని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో బీజేపీకి ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. యాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





● అసంపూర్తిగా సచివాలయ భవనం



సభా వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

నేడే రా.. కదలిరా

- వడ్లమూడిలో బహిరంగ సభ
- లక్ష మంది కోసం విస్తృత ఏర్పాట్లు
- టీడీపీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్న చంద్రబాబు

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 28: టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం రా కదలిరా సభ చేబ్రోలు మండలం వడ్లమూడిలో సోమవారం జరగనున్నది. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో రా కదలి రా సభకు విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభ ద్వారా మరో 70 రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ కేడర్‌ను సన్నద్ధం చేసేలా సభా ఏర్పాట్లను చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి సారిగా వడ్లమూడిలో చంద్రబాబు రా కదలి రా బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. క్వారీ దేవాలయానికి సమీపంలో బహిరంగ సభ నిర్వహిస్తుండటంతో మహా శివరాత్రి ముందే వచ్చిందా అన్నట్లు ఆ ప్రాంతంలో కోలాహల వాతావరణం నెలకొంది. 32 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సభకు ఏర్పాట్లు చేశారు. పొన్నూరు, ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, గుంటూరులతో పాటు వేమూరు, రేపల్లె, బాపట్ల తదితర నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే రా కదలి రా బహిరంగ సభా వేదికకు ఎన్టీఆర్ సభా ప్రాంగణంగా పేరు పెట్టారు. వంద మంది అతిథులు ఆసీనులయ్యేలా వేదిక నిర్మాణం చేపట్టారు. సభా స్థలికి చేరుకునే మార్గాన్ని సిద్ధం చేశారు. వీఐపీల రాక కోసం సభ స్థలి వెనుక వైపుగా క్వారీ దేవాలయం నుంచి ప్రత్యేకంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం మంచినీరు, మజ్జిగ, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే క్వారీ సమీపంలో హెలిప్యాడ్ సైతం సిద్ధమైంది. ఒక్కో నియోజకవర్గ ఇన్‌చార్జి 50 బస్సులు, 100 కార్లు, 1000 ద్విచక్ర వాహనాలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల రీత్యా అంచనాలకు మించి సభకు జనం భారీగా హాజరయ్యే అవకాశం ఉన్నట్లు నాయకులు తెలిపారు.



సిద్ధమవుతున్న వేదిక



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నరేంద్ర కుమార్, కొనకళ్ల నారాయణ, రాజకుమారి తదితరులు

పసుపు మయం.. ప్రభల నిర్మాణం

టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రా కదలి రా బహిరంగ సభకు తరలివచ్చే అభిమానులకు స్వాగతం పలికేందుకు భారీగా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. దీంతో నారాకోడూరు నుంచి సభా ప్రాంగణం వరకు రహదారికి ఇరువైపులా పసుపుమయంగా మారింది. వేదిక ప్రాంగణంలో మూడు భారీ బెలూన్లను ఎగురవేశారు. సభా ప్రాంగణం వద్ద క్వారీ తిరునాళ్లను తలపించేలా నారాకోడూరు, చేబ్రోలు టీడీపీ నాయకులు విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. ఏర్పాట్లను ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నన్నపనేని రాజకుమారి, శ్రావణ్‌కుమార్, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, ఎమ్మెల్సీ రాజు, కోవెల్లమూడి నాని, రామాంజనేయులు, నాగూర్ మీరా, మన్నవ సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

నిధులు నిర్మాణాలు నై

- మూడేళ్లుగా సాగదీస్తున్న పాలకులు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఆపసోపాలు
- ప్రభుత్వ ప్రాధాన్య భవనాలపై నిర్లక్ష్యం
- నిధుల కొరతతో ఎక్కడివక్కడే నిర్మాణాలు
- దారి మళ్లిన కేంద్రం ఉపాధి హామీ నిధులు
- 2,740 భవనాలకు 1,227 నిర్మాణాలే పూర్తి

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు.. అయితే నిధులు ఇవ్వకపోవడంతో మూడేళ్లుగా నిర్మాణాలు సా..గుతున్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు గ్రామాభివృద్ధిలో కీలకమైనవని పాలకులు ప్రకటించారు. ఆర్భాటంగా నిర్మాణాలు చేపట్టారేకాని నిధులు విడుదలలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఆపసోపాలతో పనులకు వెనుకంజ వేస్తున్నారు. మూడేళ్లు నిధులు రాక.. నిర్మాణాలు సాగక ఎక్కడ భవనాలు అక్కడే అన్న చందంగా మారాయి. ఉపాధి హామీ పథకం కింద ఆయా భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అయితే కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధులకు కొరత ఏర్పడటం.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయా భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు కొరత.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రగతి పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరతతో విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల భవనాల నిర్మాణాలు మూడేళ్లుగా సాగదీస్తున్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు భవనాల నిర్మాణాలను నిలిపివేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,740 భవనాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికీ 1,227 భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గ్రామ స్వరాజ్యం తీసుకు వచ్చేందుకే సచివాలయ వ్యవస్థకు ఏర్పాటు చేసి భవనాలను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో అది కనిపించడంలేదు. ఈ పరిస్థితుల్లో పలు గ్రామాల్లో సచివాలయాలను ఇంకా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో ఆయా భవనాల యజమానులు సచివాలయాలను ఖాళీ చేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్న సంఘటనలున్నాయి. మూడు జిల్లాల్లో 846 సచివాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టగా ఇప్పటికి 598 భవనాల నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఇంకా 248 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. 555 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 276 భవనాల నిర్మాణం పూర్తయింది. 279 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఈ భవనాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. ఏపీ అమూల్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నది. రాష్ట్రంలోని సహకార డెయిరీలను కాదని ఇతర రాష్ట్రానికి చెందిన అమూల్ డెయిరీకి అనేకరకాలుగా మేలు చేస్తున్నది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల నిర్మాణాలను ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 831 యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తి కానట్లు పంచాయతీరాజ్ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి. నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో కాంట్రాక్టర్లు మొక్కుబడిగా పనులు చేస్తున్నారు.



పిల్లర్లకే పరిమితమైన రైతు భరోసా కేంద్రం

అద్దె భవనాల్లోనే ఆర్బీకేలు..

రైతు ప్రయోజనాలు కాపాడేందుకు అంటూ ప్రతి గ్రామంలో ఆర్బీకే(రైతు భరోసా కేంద్రం)లను ఏర్పాటు చేసినట్లు పాలకులు ఊదరగొడుతు న్నారు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు కొన్ని నెలలుగా అద్దె చెల్లించడంలేదు. కొన్ని చోట్ల అద్దె చెల్లించాలని కొందరు భరోసా కేంద్రాలకు తాళాలు వేసిన సంఘటనలున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఆర్బీకేలకు రూ.కోట్లల్లో అద్దె బకాయిలు ఉన్నాయి. 548 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను చేపట్టగా 353 భవనాల నిర్మాణం మాత్రమే పూర్త యింది. ఇంకా 195 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

సచివాలయ భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
● పల్నాడు	399	279
● గుంటూరు	176	137
● బాపట్ల	271	164

హెల్త్ క్లినిక్‌ల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
● పల్నాడు	308	162
● గుంటూరు	153	59
● బాపట్ల	94	55

రైతు భరోసా కేంద్రాల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
● పల్నాడు	321	203
● గుంటూరు	79	67
● బాపట్ల	148	83

● నిర్మాణం పూర్తి కాని హెల్త్ క్లినిక్ భవనం



సంపూర్ణంగా తిరిగొస్తా

- బాధతోనే రాజకీయాలకు తాత్కాలిక విరామం
- రాయలసీమ నుంచి వచ్చినా అక్కున చేర్చుకున్నారు
- కృతజ్ఞతాభివందన సభలో ఎంపీ జయదేవ్, కుటుంబ సభ్యుల భావోద్వేగం
- భారీగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాముడు 14, పాండవులు 13 ఏళ్లు అరణ్యవాసం చేసి తిరిగి ఎంతో బలంగా వచ్చారు.. తానూ అలానే బలమైన సంపూర్ణ రాజకీయ నాయకుడిగా తిరిగొస్తా.. అని ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. ఆదివారం గుంటూరు శివారులోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో ఎంపీ జయదేవ్ కృతజ్ఞతాభివందనం కార్యక్రమం జరిగింది. దశాబ్ద రాజకీయ ప్రయాణానికి.. గుంటూరు పార్లమెంటు ప్రజల అభిమానానికి ఎంపీ గల్లా జయదేవ్ కృతజ్ఞతాభివందనం తెలిపారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి రాయలసీమ నుంచి గుంటూరుకు వచ్చినా ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకుని ఆదరించి రెండుసార్లు ఎంపీగా లోక్‌సభకు పంపారని.. వారికి పేరుపేరునా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉండాలన్న నిర్ణయం బాధాకరమైనప్పటికీ ఇది శాశ్వతం కాదని, మళ్లీ శక్తిమంతంగా సంపూర్ణ రాజకీయ నాయకుడిగా మీ ముందుకు వస్తానని ప్రకటించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతోన్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ టీడీపీని వీడటం లేదని స్పష్టంచేశారు. ప్రజల కోసం తిట్టినా, కొట్టినా, జైలులో పెట్టినా పర్వాలేదని, అలాకాకుండా రాజకీయాల్లో కొనసాగుతూ గమ్మున కూర్చోవటం తనవల్ల కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టార్గెట్ చేసినా పార్టీని వీడలేదన్నారు. ఈ సందర్భంగా జయదేవ్‌తోపాటు ఆయన తల్లి గల్లా అరుణకుమారి, సోదరి డాక్టర్ రమాదేవి భావోద్వేగానికి లోనయ్యారు.

ఎంపీగా అహర్నిశలు గల్లా కృషి : లోకేశ్

2013లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు చంద్రబాబు పిలుపుతో గల్లా జయదేవ్ టీడీపీలోకి వచ్చి, ఎంపీగా గెలిచి గుంటూరు అభివృద్ధికి అహర్నిశలు కృషిచేశారని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. అమరావతి రాజధాని రైతుల పక్షాన నిలిచి ముట్టడి కార్యక్రమంలో అసెంబ్లీ తలుపులు తట్టిన వ్యక్తి జయదేవ్ అన్నారు. ఆ రోజున పోలీసులు దొంగచాటుగా గిచ్చినా, ఏ స్టేషన్‌కు తీసుకెళుతున్నారో తెలియని పరిస్థితి ఉన్నా నమ్ముకొన్న సిద్ధాంతం కోసం రైతుల తరుపున పోరాడారన్నారు. అది జరిగిన వెంటనే ఎంపీ జయదేవ్ సంస్థలను ఇబ్బంది పెట్టడం వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పార్టీ మారితే వదిలేస్తామన్నా లొంగలేదన్నారు. జయదేవ్ రాజకీయాలకు దూరంగా ఉన్నా రాష్ట్రాభివృద్ధికి సహకారం అందిస్తారని చెప్పారు. ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ విశాల దృక్పథం, ముక్కు సూటితనం జయదేవ్ సొంతమని ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో అరుదుగా ఉంటారని చెప్పారు. మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గుంటూరు ఎంపీగా హ్యాట్రిక్ కొట్టే అవకాశం ఉన్నా రాజకీయాలకు దూరంగా ఉండాలని జయదేవ్ తీసుకున్న నిర్ణయానికి మనమంతా గౌరవిద్దామన్నారు. శ్రీకాకుళం ఎంపీ కింజవరపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ అమరావతి కోసం జయదేవ్ అహర్నిశలు తపించారని, ఇప్పుడు ఆ బాధ్యత తాను తీసుకుని పార్లమెంట్‌లో పోరాడతానన్నారు.

సైకత శిల్పం

ఎంపీ జయదేవ్‌కి వీడ్కోలు పలికేందుకు తెలుగు యువత నాయకుడు రావిపాటి సాయికృష్ణ శ్రీకన్వెన్షన్ ప్రాం గణంలో ఏర్పాటుచేసిన సైకత శిల్పం అందరిని ఆకర్షించిం ది. టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంపీ జయదేవ్ కృతజ్ఞతాభివందనం కార్యక్రమా నికి భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటుచేశారు. అలానే కార్యకర్తలతో ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, టీడీపీ సీనియర్ నేతలు మాకినేని పెదరత్తయ్య, కోవెలమూడి రవీంద్ర, షేక్ నసీర్‌అహ్మద్, బూర్ల రామాంజనేయులు, నన్నపనేని రాజకుమారి, డాక్టర్ నిమ్మల శేషయ్య, మన్నవ మోహన్‌కృష్ణ, మన్నవ సుబ్బారావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, డేగల ప్రభాకర్, దామచర్ల శ్రీనివాసరావు, కనపర్తి శ్రీనివాసరావు, దాసరి రాజామాష్టారు తదితరులు పాల్గొన్నారు. అమరావతి రాజధాని రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై జయదేవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



తన సైకత శిల్పం వద్ద ఎంపీ గల్లా జయదేవ్



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, రాజధాని మహిళా రైతులు

రాష్ట్రమంతా పసుపుమయమే

- రోల్‌మోడల్‌గా మంగళగిరిని తీర్చిదిద్దుతా : లోకేశ్
- వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

మంగళగిరి, జనవరి 28: మంగళగిరే కాదు.. వచ్చే 72 రోజుల తర్వాత రాష్ట్రమంతా పసుపుమయం కానున్నదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరిలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఓ ప్రవాహంలా సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం మంగళగిరికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులతోపాటు సుమారు 500 కుటుంబాల వారు ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరిలో ఇపుడెక్కడా వైసీపీ కానరావడం లేదన్నారు. 2024 ఎన్నికల అనంతరం రాష్ట్రమంతా అచ్చెరువొందుతూ మంగళగిరి వైపు చూసేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఓ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు. 2019 ఎన్నికలకు సరిగ్గా 21 రోజుల ముందు తాను మంగళగిరి బరిలో దిగానని, అప్పట్లో తానేంటో మంగళగిరి ప్రజలకు తెలియదని.. అందుకే ఓటమి చెందానన్నా రు. తాను తిరిగి ఇక్కడే గెలవాలని మంగళగిరితో అనుబంధాన్ని పెంచుకుంటూ ప్రజలకు దగ్గరయ్యానన్నారు. ఓడిపోతే అందరూ పత్తా లేకుండా పోతారని, కానీ తానలా కాకుండా మంగళగిరి ప్రాంత సమస్యలను అధ్యయనం చేస్తూ ప్రభుత్వానికి సమాంతరంగా 29 రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిరాటంకంగా ప్రజలకు అందిస్తూ వచ్చానన్నారు. తాను వైసీపీ నాయకుల మాదిరి మోసగాడిని కానని.. ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసి తీరుతానని చెప్పారు. నవులూరు మాజీ ఎంపీటీసీ షేక్ హసన్‌తోపాటు 50 కుటుంబాలు, రుద్రు శ్రీనివాసరావు, తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన మక్కపాటి ఏసుప్రసాద్, మంగళగిరి 24వ వార్డుకు చెందిన ఉజ్జిరి నాగేంద్రం, ఆత్మకూరుకు చెందిన తేలు ఫిరోజ్ నాని, దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన మాజీ సర్పంచ్‌లు డోల శివగంటబాబు, రాయపూడి కోటేశ్వరరావు, తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన మహిళలు, తాడేపల్లి 3, 8, 12, 17, 20 22, 23 వార్డులకు చెందిన అన్నూరి జార్జి, వనమా దిలీప్, ఇసుకపల్లి శ్రీనివాస్, మేడికొండ సతీష్, అన్నూరి వివేక్, అనుమోలు సాంబయ్య, చింతలపూడి కీలేనమ్మ,లాకా తిరుపతయ్యయాదవ్, లాకా కృష్ణయాదవ్, మహ్మద్ సలీం, రెడ్డి నిర్మల, బాజీలతో పదుల సంఖ్యలో వైసీపీ కుటుంబాలవారు టీడీపీలోకి వచ్చారు. వీరికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు తోట పార్థసారధి, దామర్ల రాజు, తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య, వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



నవులూరు మాజీ ఎంపీటీసీ షేక్ హసన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్



జై లోకేశ్ అంటూ నినాదాలు...

దేవుని ఆరాధన మనోహరం

- జె.శామ్యూల్ కిరణ్
- మూడోరోజు కొనసాగిన బైబిల్ మహోత్సవాలు

పెదకాకాని, జనవరి 28: సకల జనులకు బైబిల్ మహోత్సవాల ద్వారా ఆశీర్వాదం కలుగుతుందని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ప్రాంగణంలో ఫాదర్ ఎం.దేవదాస్ బయలుపరిచిన బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ ప్రభు బోధనలతో ఆత్మీయ సంతోషం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా హాజరవుతున్న భక్తులు, ప్రజలు మహదానందం పొందుతున్నారని చెప్పారు. హృదయ శుద్ధితో ప్రార్థన చేయాలని సూచించారు. వేలాదిమంది భక్తులు ధవళ వస్త్రాలతో ప్రార్థనలకు హాజరయ్యారు. బైబిల్ మిషన్ ఉపాధ్యక్షులు పి.జాన్ దేవదాస్ వాక్యోపదేశం చేస్తూ ప్రపంచానికి ఏసుక్రీస్తు ప్రేమను చాటడంలో బైబిలు మిషన్ ప్రముఖ పాత్రను పోషిస్తుందన్నారు. వాక్యమనే సంపద ద్వారా సుసంపన్నులుగా ఎదగ వచ్చన్నారు. ఎదుటివారిని క్షమించి ప్రేమించాలని హితవు పలికారు. అనంతరం హైదరాబాద్ యశోద హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సుంకవల్లి చిన్నబాబు రచించిన లైవ్ ఫర్ లెగసి (వారసత్వం కోసం జీవించండి) పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాకాని స్వస్తిశాల సంగీత బృందం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలందరినీ పరవశింప చేశాయి. వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాస్, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రెటరీలు సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.రవి ఆశీర్వాదాలు అందజేశారు.



మహోత్సవాల్లో ఆశీర్వాద ప్రార్థన చేస్తున్న బైబిల్ మిషన్ అధ్యక్షుడు జే.శామ్యూల్ కిరణ్



నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బాబురావు

కనుమూరి హాస్పిటల్‌లో
నవజాత శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

గుంటూరు (మెడికల్) జనవరి 28: గుంటూరు కొత్తపేటలోని కనుమూరి హాస్పిటల్‌లో నవజాత శిశువులకు ప్రత్యేక సంరక్షణ కేంద్రం నియోనేటల్ సెంటర్ వెల్ బేబీని ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ గడ్డిపాటి బాబురావు, డాక్టర్ మామిళ్లపల్లి మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోనేటాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ రాజు మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టి, అతి తక్కువ బరువు కలిగిన శిశువుల వైద్యానికి సంబంధించి అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గుంటూరులో మొదటిసారిగా వెంటిలేటర్‌పై ఉన్న ఆక్సిజన్ అందని నవజాత శిశువులకు ఇనిహేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్ పరికరం అందుబాట్లోకి తెచ్చినట్లు చెప్పారు. నవజాత శిశువులకు అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహించే సదుపాయాలు ఉన్నాయన్నారు. ఇంక్యుబేటర్, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ వంటి అధునాతన వైద్య పరికరాలు ఉన్న ఆంబులెన్స్ కూడా సమకూర్చామని డాక్టర్ రాజు వెల్లడించారు. కనుమూరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నవజాత శిశువులకు సంభవించే పలు రకాల శ్వాసకోశవ్యాధుల నిర్ధారణకు, చికిత్సకు అవసరమైన నియోనేటల్ బ్రాంకోస్కోపీ గుంటూరులోనే మొదటిసారిగా తమ ఆసుపత్రిలో సమకూర్చినట్లు తెలిపారు. ఎన్ఐసీయూ వార్డులో 24 గంటలూ వైద్యనిపుణులు అందుబాట్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి


తెలుగుదేశం పిలుస్తోంది...
రా.. కదలిరా!!
ఛలో పొన్నూరు...
బహిరంగ సభ
వేదిక:
క్వారీ గుడి దగ్గర, వడ్లమూడి గ్రామం
సమయం:
మధ్యాహ్నం 2.00 గంటల నుండి..!
మీ సంకల్పం నిరుపమానం... మీ పోరాటం అపురూపం
మీ నాయకత్వం దేశానికే ఆదర్శం...
నిరంతర శ్రామికుడు, అవిశ్రాంత పోరాట యోధుడు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం – సుస్వాగతం
మీ
కనపర్తి శ్రీనివాసరావు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు
నందిగామ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మేము వాడొచ్చు.. మీరు అమ్మకూడదు...

● నిషేధిత ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారుల ద్వంద్వ నీతి
● వికసిత భారత్ సంకల్ప యాత్రలో తాగునీటికి ప్లాస్టిక్ గ్లాసులు


ప్లాస్టిక్ గ్లాసును వినియోగిస్తున్న చిన్నారి

తెనాలి అర్బన్, జనవరి 28: నిషేధిత ప్లాస్టిక్‌ను మున్సిపల్ అధికారులు వాడొచ్చు కానీ, వ్యాపారులు, విక్రయదారులు అమ్మకూడదనే ద్వంద్వ నీతి విమర్శలపాలు అవుతోంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం వచ్చిన వారికి తాగునీటికి ప్లాస్టిక్ గ్లాసులు ఏర్పాటుచేశారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధించినప్పటికీ అధికారులే వాటిని వినియోగించడం ఏమిటంటూ పలువురు మాట్లాడుకోవడం వినిపించింది. దుకాణాలలో నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించకూడదంటూ వినియోగించకూడదంటూ దాడులు చేస్తూ వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ కార్యక్రమానికి ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించడం చూస్తే నిషేధంపై ఉన్న శ్రద్ధ ఏమిటో అవగతం అవుతుందని పలువురు విమర్శించారు. ఇకనైనా కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్‌పై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

వాసవీ కుటుంబ సురక్ష సాయం రూ.30 లక్షలు పంపిణీ

తెనాలి అర్బన్, జనవరి 28: వాసవీ కుటుంబ సురక్ష పథకం కింద ఆదివారం రూ.30లక్షలు సాయం అందజేశారు. స్థానిక గీతా మందిరంలో 60మంది బీమా చేసిన సభ్యుల కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. క్లబ్ డైరెక్టర్ తూనుగుంట్ల జయంత్‌కుమార్ మాట్లాడుతూ, 2011లో వాసవీ సురక్ష పథకం మొదలైందని, ఈ పథకంలో చేరిన సభ్యులకు బీమా సాయం అందుతుందన్నారు. ఇప్పటి వరకు రూ.50కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎస్.సుబ్బారావు, కళ్యాణ్, మురళి, రామమోహనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లి కోటకు బీటలు: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జనవరి 28: వడ్లమూడిలో జరిగే టీడీపీ, జనసేన రా కదలి రా బహిరంగ సభతో తాడేపల్లి కోటకు బీటలు వస్తాయని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. వడ్లమూడి బహిరంగ సభ వేదిక వద్ద ఆదివారం ఏర్పాట్లను ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నన్నపనేని రాజకుమారి, శ్రావణ్ కుమార్, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయ బాబు తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పరిధిలోని ఏడు నియోకవర్గాల పరిధిలో 2లక్షల మంది బహిరంగ సభకు హాజరవుతారని అంచనా అన్నారు. గతంలో ఎన్టీఆర్ పిలుపుతో తెలుగు ప్రజలు కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేశారన్నారు. నేడు చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న రా కదలి రా పిలుపుతో ఎక్కడ సభ నిర్వహించినా భారీఎత్తున ప్రజలు తరలివస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు టీడీపీ, జనసేన కూటమి పోరాడుతుందన్నారు. ఇరు పార్టీలకు చెందిన 2లక్షల మంది సభలో పాల్గొంటారని స్పష్టంచేశారు. అధికార పార్టీ అరాచకానికి బలైన బాధితులు సభలో స్టార్ క్యాంపెనర్లుగా నిలవనున్నారు. వైసీపీ నేతలు దోపిడీయే సర్వస్వంగా రాష్ట్ర ప్రకృతి వనరులను దోచుకున్నారని ధ్వజమెత్తారు. అణిచివేయబడిన ప్రజలు తాడేపల్లి కోటను సభ ద్వారా బద్ధలు కొట్టడం ఖాయం అన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు ఈ సభను శంఖారావ సభగా పేర్కొన్నారు. ప్రజా తిరుగుబాటుకు వడ్లమూడి సభ వేదిక కానున్నదని స్పష్టం చేసారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్సీ రాజు, కోవెలమూడి నాని, బి.రామాంజనేయులు, నాగుల్‌మీరా, మన్నవ సుబ్బారావు జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెనాలిలో తిరుమల శ్రీవారి తరహా సేవలు

● వారం రోజుల పాటు శ్రీవేంకటేశ్వర సప్తాహం
● రూ.1.50 కోట్లతో భారీ ఏర్పాట్లు


సప్తాహ ఉత్సవాల కోసం ఏర్పాటుచేసిన వేదిక

తెనాలి అర్బన్, జనవరి 28: ప్రపంచవ్యాప్తంగా భక్తులు తరలి వెళ్లి దర్శించుకునే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సేవలు చూసి తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. అలాంటి సేవలే తెనాలిలో కూడా నిర్వహించేందుకు ఓ భక్త బృందం భారీ ఏర్పాట్లు గావించింది. శ్రీసాలిగ్రామం మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని తాలూకా జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి వారం రోజుల పాటు శ్రీగోవిందనామ జప యజ్ఞ పూర్ణాహుతి, శ్రీవేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రజ్ఞానంద సరస్వతి, బాల స్వామిజీ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి వుప్పల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు రూ.కోటిన్నర పైగా వెచ్చించి భారీ ఏర్పాటుచేశారు. 29వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, తోమాల సేవ, కొలువు అర్చన, బాలభోగం, నవనీత హారతి, దివ్య ప్రబంధం, రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. యాగశాలలో విష్వక్సేన ఆరాధన, పంచగవ్య ప్రాసన, గోపూజ, అర్చన, హోమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ శృంగేరీ శారదా పీఠ ఆస్థాన పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి, శ్రీవేంకటేశ్వర వైభవ సప్తాహ ప్రవచనం చేస్తారు. లక్ష లడ్డూలతో స్వామి వారికి సమర్పించి నివేదిస్తారు. ప్రతిరోజూ అల్పాహారం, అన్న ప్రసాదం పంపిణీ చేస్తారు. 29న సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణ, 30న సౌందర్యలహరి, సహస్ర గళార్చన ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

నన్నపనేని వెంకట్రావుకు ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రులు ఆనంద్‌బాబు, రాజకుమారి, సుధాకర్, సీతారామయ్య తదితరులు

తెనాలి, మారీసుపేట జనవరి 28: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన విద్యావేత్త మాజీ ఎమ్మెల్యే పట్టణ మాజీ చైర్మన్ నన్నపనేని వెంకట్రావు చిరస్మరణీయుడని ఏపీ మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. పట్టణంలోని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ఆవరణలో ఆదివారం వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు 44వ వర్ధంతి, కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, నక్కా ఆనంద్‌బాబులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థులకు నన్నపనేని వెంకట్రావు స్మారక ప్రతిభా పురస్కారాలను రాజకుమారి, ఆనంద్‌బాబులు అందజేశారు. విద్యార్థిని పావని కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. తొలుత శాంతివనంలోని ఆయన సమాధి వద్ద మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, ఆనంద్‌బాబు, ఆయన కుమారుడు కళాశాల కరస్పాడెంటు నన్నపనేని సుధాకర్, కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు, ఇంజనీరింగ్ వైస్ ప్రిన్సిపాల్ అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రా కదిలి రా'ను విజయవంతం చేయాలి: తాడిబోయిన, కేసన

తెనాలి రూరల్, జనవరి 28: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలో జరిగే రా కదలి రా కార్యక్రమానికి తెనాలి పట్టణ, మండల పార్టీ శ్రేణులు, అభిమానులందరూ పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు కోరారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు సభ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 2.30 నిమిషాలకు చంద్రబాబు సభ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తన శిక్షణ

తెనాలి, మారీసుపేట జనవరి 28: స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాం ప్రాంగణంలో రమాసహిత సత్యనారాయణ స్వామి వారి దేవస్థాన ఆవరణలో శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం వారు తిరుమల హరినామ సంకీర్తనకు వెళ్లే బృందాలకు ఉచితంగా హరినామ సంకీర్తన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసత్యనారాయణ భజన మండలి, శ్రీసాయిరాం సంగీత లహరి అండ్ కోలాట భజన మండలి, శ్రీఅన్నమయ్య భజన మండలి మరియు శ్రీవాపవి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం


రోటరీ క్లబ్ అవార్డు అందుకున్న వారితో క్లబ్ నిర్వాహకులు

తెనాలి అర్బన్, జనవరి 28: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం వొకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ ప్రతినిధి పి.రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలు అందించడంతో పాటు వివిధ రంగాల్లో సేవలు అందించే వారిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయా రంగాల్లో సేవలు అందించిన హెడ్ నర్స్ శారదాదేవి, మున్సిపల్ సూపర్‌వైజర్ సురేంద్ర, పోస్టల్ అసిస్టెంట్ కృష్ణయ్య, విశ్రాంత బ్యాంకు మేనేజర్ శారద, ఆర్గానిక్ సాగు చేస్తున్న రైతు పాపారావు, సూపర్‌వైజర్ రవీంద్రరెడ్డి, న్యాయవాది వెంకటేశ్వరరావు, మెకానిక్ సంపత్ రాయుడు, సాంబయ్య, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హెల్పింగ్ సోల్డర్స్ అధ్యక్షుడు వినయ్‌తుల్లా, ఆర్టిస్టు శివపార్వతి, వెయిట్ లిఫ్టర్ వెంకటేశ్వరరావులను ఎక్స్‌లెన్స్ అవార్డులతో సన్మానించారు. ప్రవాస భారతీయులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, సింగారావు, కన్నెగంటి మురళి, పావులూరి రాంబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, జగదీశ్వరాంబ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం


రూ.50 వేలు నగదు అందజేస్తున్న అచ్చయ్య

తెనాలి అర్బన్, జనవరి 28: తెనాలి వాకర్స్ క్లబ్ అభివృద్ధికి రూ.50 వేలు విరాళాన్ని దొడ్డపనేని అచ్చయ్య అందించారు. ఆదివారం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణ మూర్తి, అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నంలకు అందించారు. అచ్చయ్య సేవా దృక్పథాన్ని అభినందించారు. రత్తయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను మళ్లీ చూసినట్లు ఉంది

● ఏఐసీసీ అధికార ప్రతినిధి అన్షుల్ అభిజిత్

తెనాలి అర్బన్, జనవరి 28: బాబూజీ సినిమా చిత్రీకరణలో తమ తాత బాబుజగ్జీవన్‌రామ్‌ను మళ్లీ చూసినట్లు ఉందని ఆయన మనుమడు, ఏఐసీసీ అధికార ప్రతినిధి అన్షుల్ అభిజిత్ చెప్పారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరిస్తున్న బాబూజీ బయోపిక్ సన్నివేశాలకు ఆయన ఆదివారం క్లాప్ కొట్టారు. చిత్ర నిర్మాణంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హోటల్ గౌతమ్‌గ్రాండ్ నుంచి ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా తరలివెళ్లి స్టేషన్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలువేసి సుల్తానాబాద్‌లోని కల్యాణ మండపంలో జరుగుతున్న చిత్ర నిర్మాణంలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలి: వడ్లమూడి

తెనాలి అర్బన్, జనవరి 28: ఉన్నంతలో ప్రతిఒక్కరూ సామాజిక సేవ చేయాలని ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ మానవతా ఆధ్వర్యంలో ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోహిణి, సుబ్రహ్మణ్యం, అశోక్‌ల సాయంతో రూ.10,500 విలువ చేసే కుట్టుమిషన్‌ను జీవనోపాధి కోసం కుసుమ అనే మహిళకు అందజేశారు.

చక్రాయపాలెంలో వైభవంగా గంగానమ్మ కొలుపులు

కొల్లిపర, జనవరి 28: మండల పరిధిలోని చక్రాయపాలెంలో గంగానమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు నిర్వహించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ రవీంద్రరెడ్డి ఆలయం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

కనుల పండుగగా శ్రీవారి నగరోత్సవం

తెనాలి రూరల్, జనవరి 28: మంగళవాయిద్య వేద మంత్రాలతో గోవింద గోవిందయంటూ భక్తుల కంఠస్వరంతో లక్ష్మిపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి నగరోత్సవం కనుల పండుగగా జరిగింది. గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి, వేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవంలో భాగంగా ఆదివారం స్వామివారి నగరోత్సవం వైభోపేతంగా నిర్వహించారు.